

# ఆంతర్యం

ఎమ్. నజీబుల్లాబేగ్

*తన వారిని, అందునా తనపై ఆధారపడి తననే నమ్ముకొన్నవారిని, వారి నిజాయితీని శంకించవలసి రావడం దురదృష్టం. ధర్మానికి కట్టుబడితే తప్పదు. పరిణామాలు ఎలా ఉంటాయో చెప్పడం సాధ్యమా?*

---

"**తమరు** ఎన్నయినా చెప్పండి! మా బాబు అంతటి పని చేశాడంటే నేను నమ్మలేకండా వున్నాను!" నీలమ్మ కళ్లల్లో నీళ్లు నిండాయి.

బిడ్డలపై నిందలు మోపితే ఏ కన్న కడుపైనా భరించగలదా? బిడ్డలలో ఎన్ని లోపాలున్నా వాటిని కప్పిపుచ్చి, వాళ్ల నిర్దోషిత్వం, నిష్కళంకత్వం నిరూపించడానికి ఏ తల్లైనా నిష్కర్షగా వాదిస్తుంది. నీలమ్మదీ ఓ మాతృహృదయమే! లేకలేక కలిగిన బిడ్డ! అతి మమకారంతో కళ్లల్లో పెట్టుకొని పెంచింది నీలమ్మ.

బిడ్డలన్న తరువాత ఏవో చిలిపి చేష్టల్ని, గల్లంతులు సర్వదా చేస్తూంటారు. వాటి నన్నిటినీ మహా గొప్ప తప్పుగా ఎంచి పెద్దవాళ్లతో ఫిర్యాదుచేసే మహామహులు లేకపోలేదు ఈలోకాన. బాబు ఇలా చేశాడు, అలా చేశాడు, కొట్టాడు, తిట్టాడు — ఇంకా ఎన్నో నేరారోపణలు నీలమ్మ దాకా వచ్చేవి ప్రతిరోజూ. అటు వాళ్లను సమాధానపరిచేది, ఇటు బాబును మందలించేది, బుద్ధి చెప్పేది. ఇది నీలమ్మకు అనుదిన చర్య అయిపోయింది.

"ఇంకెన్నడూ అల్లరి చేయనమ్మా!" అంటూ



కావలి ఫోటో—వై. వాసుదేవ్ (గుంటూరు)

# అంతర్యం

మాటకూడ యిచ్చాడు ఒకానొక దినం బాబు. కాని.... మళ్లీ దినం ఓ ఫిర్యాదు! భాష్యంగారింట్లో భగవత్కార్య వినియోగంకోసం ప్రోగుచేసి ఉంచిన ద్రవ్యం అపహరించాడని ఆరోపణ!

భాష్యంగారు జిల్లా పరిషత్తులో యు. డి. సి. గా ఉంటూన్నారు. తమకు ఉద్యోగంలో ప్రమోషను వస్తే వంద టెంకాయలు కొట్టి పూజ గావిస్తానని ముక్కోటి దేవతలకు మ్రొక్కుకొన్నారు. తామనుకొన్నట్లు ప్రమోషను రానే వచ్చింది. చేసిన మ్రొక్కుబడి నెరవేర్చే బాధ్యత పైనబడింది భాష్యంగారికి. కాని వచ్చే వేతనం ఇంటి అవసరాలకే చాలటం లేదు. 'ఎలా మ్రొక్కుబడి నెరవేరాలి' అనే సందిగ్ధావస్థలో ఇరుక్కున్నారు భాష్యంగారు. యోచించి యోచించి చివరకు ఓ నిర్ధారణకు వచ్చారు. ఆ నిర్ణయప్రకారం అడపా దడపా కొద్దికొద్దిగా పైకం కూడబెట్టుతూ వచ్చారు. అలా చేరబెట్టిన డబ్బుతో తమ వ్రతాన్ని పూర్తి చేయాలన్న ఉద్దేశంకొద్దీ ఓదినం తమ సూటు కేసును తెరిచారు. ఏముంది? తానొక్కటి తలచిన దైవమొక్కటి తలచునన్నంత పనయింది. డబ్బు మాయమైంది. భార్యను పిలిచి అడిగారు. కొడుకును మందలించి విచారించారు. తల బాదుకొన్నారు. కాని ఫలితం శూన్యం!

'వేసిన తాళం వేసినట్టే ఉంది! మరీ..... డబ్బు ఏమైనట్టు?.... డబ్బు ఎలా మాయమైనట్టు?' సందేహాస్పదమైన ఆలోచనలు మనసును చెదరగొట్టాయి భాష్యంగారిని. ప్రక్కనున్న కుర్చీమీద చతికిల బడ్డారు.

'ఇది ఇంటి దొంగదై ఉండాలి! లేదా..... సూటుకేసులో డబ్బున్న విషయం బాగా ఎరిగినవాడై ఉండాలి.' తిరిగి అనుమానమే. సిగరెట్టు పొగ ఘాటుగా పీల్చి వదిలారు భాష్యంగారు.

భాష్యంగారింట్లో ఉండేది ఆయన పోను ఎనిమిది మంది—భార్య, తల్లి, ఆరుగురు బిడ్డలు.

భార్యమీద భాష్యంగారికి బొత్తిగా అనుమానం లేదు. అవిశ్వాసమనేదికూడ లేదు. కారణం, ఆవిడ తనింట్లో కాలు పెట్టినప్పట్నుంచి ఎన్నడూ ఈలాంటి వ్యాజ్య కారణాలు కలుగలేదు. ఆమెను అనుమానించటం అసంభవం. ఇక తల్లి విషయమంటే ఆమె ఇప్పుడో, అప్పుడోనని చావుబ్రతుకుల్లో ఉంది. ఆమెనంటే కళ్లు పోతాయి. మిగిలింది బిడ్డలే. వారు బుద్ధిమంతులు. తెలివితేటలు గలవారు. వాళ్ల ప్రవర్తన, స్వభావం, వైఖరి తెలియనివి కాదు. కనుకనే వారు ఆయన దృష్టిలో నిర్దోషులు. అందుచేత ఈ దొంగతనానికి మూలకారణం పరాయి వాళ్లేగాని స్వంతదారులు కారని నిస్సందేహంగా నిశ్చయించారు భాష్యంగారు.

రెండువ్రేళ్ళ మధ్య కాలుతున్న సిగరెట్టు సెగ తగిలి త్రుళ్లిపడ్డారు.

"ఇదేం మౌనమండీ! ఇల్లాగే నెమ్మదిగ కూచుంటే పోయిన డబ్బు వెతుక్కోవస్తుందా! పోలీసులో రిపోర్టువ్రాసి పడేయకూడదూ?" కాఫీ తెచ్చి బల్లమీద పెట్టుతూ అవివేకంగా అంది భాష్యంగారి సతీమణి సుశీల.

"అసలు నేరస్తుడి జాడ తెలియనిదే!....." తిరిగి ఆలోచనలో పడ్డారు భాష్యంగారు, తమ చూపుడు వ్రేలితో పెదిమలను మెల్లగా గీకుతూ.

"ఏం దీర్ఘాలోచనండీ ఇది? కాఫీ చల్లారి పోతుంటేను....." అంది సుశీల కాఫీకప్పును అందిస్తూ.

భాష్యంగారు కప్పును అందుకొని, పెదిమలదాకా పోనిచ్చారో లేదో అప్రయత్నంగా అడిగారు: "సుశీ! నీకు ఎవరిమీదనైన అనుమానముంటే చెప్పు. నాకో ఉపాయం తోచింది."

"[illegible] వేసే వదులా రా

అండి?" రానున్న విపత్తును ముందుగా సూచిస్తూ అంది సుశీల.

"ఎవరికేం నష్టం?" మానసిక దుఃఖంలో నలిగిపోతున్న భాష్యంగారు మళ్లీ అడిగారు. సుశీల వాళ్లింటికి పదేపదే వచ్చేవాళ్ల సంఖ్య వరుసగా చెప్పింది — పక్కింటి రెడ్డెమ్మ, శంకరయ్య ఇల్లాలు, శాస్త్రులుగారబ్బాయి బాబు వగైరాలు. జాబితా నొకటి తయారుచేసిఅందులో తమింట్లో ఉన్నవాళ్లనమేతం కలిపారు. తరువాత దానిని ముక్కలు ముక్కలుగా కత్తిరించి, చుట్టేసి, ఓ డబ్బాలో వేసి పాపాయిని రప్పించి, ఓ కాయితం ముక్కను ఎత్తమన్నారు. పాపాయి అలాగే చేసింది. ఆ ప్రయత్నం ప్రకారం తమ జ్యేష్ఠకుమారుడు మోహన్ అని తేలింది. దాన్ని చూట్టంతో ఎప్పటివారప్పట అట్టే విర్భాంతపోయారు. మోహన్ మొండిగావీడ్చాడు, తను అవినీతిపరుడుకానని. సుశీల మనసు కరిగింది.

తన కొడుకు వట్టి పనికిమాలినవాడని, తలిదండ్రులకు అన్యాయం చేసేంత ధైర్యం వాడికి లేదని ప్రత్యేకంగా వాదించింది. నొక్కి వక్కాణించింది. కనుక రెండోసారి కులుకు ఎత్తటం తప్పిందికాదు.

కులుకు ప్రారంభించేముందు భాష్యంగారు ఓ షరతు పెట్టారు, ఈదఫా ఎవరి పేరువస్తే వారే దండనార్హులని. సుశీల ఒప్పుకొంది. మళ్లీ పాపాయిని ఓ చీటీ ఎత్తి యివ్వమన్నారు. ఈసారి శాస్త్రులుగారబ్బాయి బాబు పేరు వచ్చింది. పై నిబంధన ప్రకారం బాబునే నేరస్తుడుగా భావించాలి. కాని భాష్యంగారి మనస్సాక్షి రవ్వయినా సమ్మతించలేదు. తన రక్తాన్ని పంచుకొని అవతరించిన బిడ్డ పేరు రాగా అత డంతవాడు కాడని వదిలేసినప్పుడు, ఇతరుల బిడ్డమాత్ర మేమంత లోకువ! దీన్ని పట్టించుకోవటం పక్షపాతం. జిత్తులమారితనం. తన అంతస్తుకే అవమానం—అని పంతులను పిలిపించి జ్యోతిష్యంద్వారా అటో ఇటో తేల్చాలనుకొన్నారు భాష్యంగారు.

పంతులువచ్చారు. "చెప్పుశాస్త్రం. చూస్తా" నన్నారు. ఓ పాదరక్షను తెప్పించి, తన చేతి నాలుగు వ్రేళ్ల కొనలమీదుంచి అనుమానపడ్డ పేర్లన్నీ ఉచ్చరించమన్నారు పంతులు. సుశీల ఒక్కొక్కరి పేరూ పలుకుతూ వచ్చింది. ఎవరి పేరిట రక్ష కదులుతుందో అతడే ఈ దొంగతనానికి ప్రధానక్రియ. చెప్పు కదల్లేదు. బాబు పేరు చెప్పారు. చెప్పు కదిలింది. ఇంకో పర్యాయం పేర్లన్నీ చిత్తశుద్ధితో పలుకమన్నారు పంతులు. 'బాబు' అనేలోగా మళ్లీ తిరిగింది చెప్పు. ఇవ్విధాన మూడు పార్లు 'బాబు' అనగానే చెప్పు తిరిగింది.

"చెప్పు నిజం పల్కింది. దొంగను పట్టిచ్చింది" అంటూ పంతులు తమ ప్రతిఫలం పుచ్చుకొని నిష్క్రమించారు.

భాష్యంగారికి జ్యోతిష్యంలో దృఢమైన నమ్మకం ఉండటానికి ఆయన హృదయంలో [illegible]

దొంగిలించి ఉంటాడనేది వేళ్లవలె నాటుకు పోయింది. 'ఫలానా అతను దొంగ అని తేలి నప్పుడు, ఆతణ్ణి తేలిగ్గా వదిలిపెడితే మనమ్మె దురభ్యాసాలకు పురికొలిపి మళ్లీ అవకాశమిచ్చి నట్లవుతుంది. ఈనాటి చిన్న చిన్న చోరీలు రేపటి పెదపెద్ద దోపిడీలు కావచ్చు. ఓ లేత వృక్షాన్ని ఇష్టానుసారం వంచ వీలవును. అదే బ్రహ్మాండంగా పెరిగినప్పుడు అహోరాత్రం తపస్సు చేసినా కూడ దాన్ని వంచ ఎవరితరం! అదేవిధంగా బాబు కిది బాల్యదశ. తెలిసీ తెలి యక చేసిన తప్పు. ఈ తప్పును సరిదిద్దుకొనే టట్లు చెయ్యాలి. దానికి ఒకే మార్గం. బాబును ఎలాగైనా దండించాలి. దండించి తీరాలి. తామ్మె దండించటం ఏం బావులేదు. వాడి పెద్దలకు ఈ సంఘటన తెలియజేస్తే, వారే సరిగ్గా దండి స్తారు. పోయిన డబ్బు సులభంగా అందుతుంది.' ఆలోచన మేఘాలు భాష్యంగారి మనస్సును కప్పేసినవి.

ఇప్పుడు తగ్గట్టు ఆధారాలు, నిదర్శనాలు కొదవయాయి. అవి ఏలాగైనా సమకూరాలి. భాష్యంగారు తిరిగి తీక్ష్ణమైన యోచనలో పడ్డారు.

'బాబు వాళ్లింటికి ఎలా రాగలిగాడు? అంత చనువు వాడికి ఎలా లభ్యమైంది? వాడింత ఘోరకృత్యం ఎలా చేయగలిగాడు?' ఒక్క సారిగా భాష్యంగారి కళ్లెదుట సినిమా రీలులాగా తిరుగ నారంభించాయి కొన్ని సంఘటనలు.

ఆ దినం ఆ సంధ్యాసమయం! కొద్ది కొద్దిగా జ్ఞప్తికి వస్తూ ఉంది. సరిగ్గా అయిదు గంటలుంటుంది అప్పట్లో. టీ తీసుకొనేవేళ అది. బాబుసమేతం వచ్చాడు మోహన్. ఇంట్లో వాళ్లందరినీ పరిచయం చేశాడు. తరువాత రేడియో ఉన్న గదిలోకి వెళ్లి, రేడియోను ఆన్ చేసి, ఓ టీ కప్పును తెచ్చి అందించాడు మోహన్.

"ఎవరు, 'నాయనా', ఈ కుర్రవాడు?" మోహన్ను ప్రశ్నించారు తలిదండ్రులు.

"నా క్లాస్‌మేటు, బాబు. ఈమధ్య సంగీతం పోటీలో ఫస్టు ప్రయిజు తీసి మా క్లాసు పేరు నిలబెట్టాడు. రేడియో వినాలంటే పిలుచుకు వచ్చాను." మోహన్ జవాబిది. వాడి సంతో షానికి మేరలేదు.

"అలాగా!" ఆశ్చర్యచకితు లయ్యారు తలి దండ్రులు.

క్రమేణ అందరిలో పరస్పర స్నేహబాంధ వ్యాలు కుదిరాయి. ఏ భేదం, ఏ సందడి లేకండా అందరు చాలా అన్యోన్యంగా, అతి విశ్వాసంగా మెలుగుతూ వచ్చారు. కాలచక్రం యథావిధిగా తిరుగుతూ ఉంది.

భాష్యంగారు బీగం చెవుల్ని సూటుకేసులో ఉంచేసి, తాళాన్ని అట్టే అదిమిన రోజది. ఆఫీసుకు పోయే వేళ మీరిపోతూంటే, ఆఫీసు బీగాలు లేనిది ఎలా పోవడమంటూ హడావిడిగా ఉన్నారు భాష్యంగారు.

"మా ఇంట్లోనూ ఈ మోస్తరు తాళం ఉంది. దాని చెవి సరిపోతుందా చూడండి. కావాలంటే ఇంటికెళ్లి క్షణంలో తెస్తాను" అంటూ బాబు ఎలెక్ట్రిక్ ట్రెయినుకన్న వేగంగా పోయి శీఘ్రంగా తెచ్చి పెట్టాడు తాళంచెవులు. అందున్న ఓ చిన్న బీగం చెవి అట్టే సరిపోయింది. భాష్యంగారు బాబు తెలివికి మెచ్చి "శబాష్ బాబు, శబాష్!" అంటూ ఘనంగా అభినందిస్తూ వెళ్లిపోయారు.

భాష్యంగారు ఓ సిగరెట్టు ముట్టించి, ఘాటుగా పీల్చి సుడిగుండంలా పొగనువదులుతూ పై వృత్తాంతంలోంచి ఈ వ్యవహారానికి సరి పోయే ముఖ్యాంశాలు విడదీసే యోచనలో నిమగ్నులయారు.

ఆరోజు సూటుకేసులోఉన్న డబ్బును చూశాడు గనక బాబుకు సూటుకేసులో డబ్బుండే విషయం బాగా తెలుసు. తమ తాళానికి సరి పోయే బీగం చెవి దగ్గరుంది కాబట్టి ఏ ఇబ్బందీ లేకుండా తాళాన్ని తెరవగలిగాడు. తరను వాళ్లింట్లో నిర్బంధంలేని ప్రవేశముంది గనుక అందరి కళ్లల్లో దుమ్ముచల్లి నిర్భయంగా దోచుకు పోయాడు.

ఇంకేం? ఈ వ్యవహారాని కనుగుణంగా ఆధా రాలు చాలినంత ఉన్నాయి. బలమంతా తన పక్షమే. ఆలస్యం చేయుగూడదు. ముందుకు సాగి ఈ కార్యాన్ని సాఫీగా నిర్వహించవచ్చుననే దీక్షతో బయల్దేరారు భాష్యంగారు.

ఆది శాస్త్రులుగారి చిన్న పెంకుటిల్లు. కట్టడం ప్రాచీనకాలపు రీతిలో ఉంది. అక్క డక్కడ పెంకులు కొన్ని విరిగి రాలి ఉన్నాయి. ఓతట్టు గోడ కూలి ఇల్లు పడిపోయే స్థితిలో ఉంది. బయటి గోడపై వర్షపు నీరు పారిన ఛాయలు కనబడుతూ ఉన్నాయి. ఇంటిముందర 'శాస్త్రి హోమియోపతి వైద్యశాల' అనే ఓ పాతబడ్డ బోర్డు వ్రేలాడుతూ ఉంది.

శాస్త్రులుగారు తమ వైద్యం గదిలో కూర్చుని ఏదో మందు తయారీలో ఉన్నారు. భాష్యంగారు గుమ్మందాకా వెళ్లి సంకోచిస్తూ "వైద్యులుగారూ!" అని పిలిచారు.

"లోనికి రండి!" లోపల్నుంచి శాస్త్రులుగారి కంఠస్వరం ఆహ్వానించింది.

భాష్యంగారు లోనికి ప్రవేశించారు. నమ స్కార ప్రతినమస్కారాల తర్వాత కుర్చీమీద కూర్చున్నారు.

"ఏమండీ, ఏం కావాలి?"

"ఏం లేదుగాని.... బాబు మీ అబ్బాయే కదండీ?"

"అవును.... ఎందుకని....."

"ఆః.... ఏంలేదు... కాస్త వాణ్ణిలా పిలు స్తారా?"

"వాడింట్లో లేనట్టుంది. పిలవమంటే..."

"అక్కర్లేదులెండి."

"తమరు?"

"నేనా అండి? ఎం. ఏ. భాష్యం నాపేరు. ఇన్‌వ్యాలిడ్ లేను సెకెండ్‌హౌస్‌లో ఉంటున్నాను. డిస్ట్రిక్టు బోర్డు ఆఫీసులో హెడ్ గుమాస్తాగా ఉద్యోగం చూస్తున్నాను."



ఇక్ష్వాకుసుందరి (నాగార్జునకొండ)
ప్రతిచిత్రం—సి రంగప్ప (కదిరి)

"ఓహో. ఆలాగా!.... అయితే మా బాబు మీకెలా పరిచయం?"

"మా అబ్బాయికి స్నేహం. అప్పుడప్పుడు మా ఇంటి కొస్తూ పోతూంటాడు లెండి..... అయినా.... ఆ గొడవ ఇప్పుడెందుకుగాని...... చూడండి! నేనొక వ్రతం చేయదలచుకొన్నాను. కాని......"

"కాని?"

"నాలుగు రోజులక్రితం మీ అబ్బాయి...."

"మా అబ్బాయి!.... కొంపతీసి ఏంచేయ లేదు కదా?"

"లేకుంటే పిలువని పేరంటాని కెందు కొస్తాను, చెప్పండి?"

"చేసింది కాస్త స్పష్టంగా చెప్పరాదూ?... చెప్పండి."

"ఏం చెప్పను వైద్యులుగారూ? ఆ వ్రత వినియోగానికని ఉంచిన డబ్బు స్వాహాచేశాడు." మండే కట్టెపై మట్టినూనె పోసినట్లు అన్నారు భాష్యంగారు.

"భాష్యంగారూ!" గర్జించారు శాస్త్రులు ఆగ్రహావేశంతో. తిరిగి తన్ను తానే అదుపులో పెట్టుకొని, "మేమేదో మాచోట గౌరవంగా బ్రతుకుతున్నాం!.... ఏమిటీ అపోహ!" అన్నారు.

"తగ్గండి, వైద్యులుగారూ! నే చెప్పేదంతా యదార్థమేగాని అపోహ కాదు. మీరు కోరి నట్లయితే తగిన ఆధారాలతో రుజువు చేయ సంసిద్ధంగా ఉన్నాను."

"అయితే, ఇదంతా నిజమేనంటారా?"

"అక్షరాలా!....చూడండి. అది నా స్వంత ఖర్చుకు ఉంచినడబ్బు అయివుంటే, ఇందాకవచ్చి మీకు శ్రమ కలిగించి ఉండను. దైవకార్యంది కాబట్టే... ఓర్వలేకపోయాను."

"ఆ డబ్బు ఎంతమాత్రం ఉంటుంది?"

"ఇంచు మించు ఏభై!"

"సరి. మీరిక వెళ్లండి. వాడింటికి రానీ,

వాడి పనిపట్టాను."

"అయితే.... నన్ను రేపు రమ్మంటారా?"

"మీకా కష్టం వద్దు. రేపటిదాకా మీ డబ్బు చేర్చే బాధ్యత నాది. మీరు వెళ్లండి."

"నమస్తే! వస్తాను. శ్రమ కలిగించినందుకు క్షమించండి."

తాను వేసిన ఎత్తు సార్థకమైనందుకు లోలోన సంతోషిస్తూ ఇంటిదారి పట్టారు భాష్యంగారు.

శాస్త్రులుగారి కోపం హద్దుమీరింది. బాబు ఇంటికి వస్తే ఏం చేయాలో తోచలేదాయనకు. మనసులోని ఆవేదన రక్తాశ్రువులై ప్రవహించింది. ఎవరికీ తలవంచని శాస్త్రులు నేడు లొంగిపోవలసివచ్చింది. బాబుమీద ఎన్నో ఆశలు పెట్టుకొన్నారు. వాడు పెద్దవాడై భావి భారత నాయకుడు కావాలని శ్రీ వేంకటేశ్వర స్వామిని పదేపదే ప్రార్థించేవారుకూడా. తన ఆశయాలన్నీ గాలిలోకట్టిన మేడలైనాయి.వాడు ఇంత అప్రతిష్ఠ తెస్తాడని కలనైనా అనుకోలేదు. తనిప్పుడు నలుగురిలో తలెత్తి ఎలా తిరగటం? ఎవరైనా 'మంచి కొడుకు కన్నావయ్యా!' అంటే చిన్నతనం కాదా తనకు! ఛీ! ఛీ! ఇటువంటి బిడ్డ ఉంటేనేమి? ఛస్తేనేమి? శాస్త్రులుగారి మనసులో మండుతున్న కోపాగ్ని జ్వాలల్ని కక్కింది. కళ్లు ఎర్రబడినాయి. వాకిటి కవతల నుంచుని వీరి సంభాషణ వింటూన్న నీలమ్మ భర్తను ఎన్నో విధాల ఓదార్చింది. **కాని తాను పట్టిన కుందేటికి మూడు కాళ్లంటే మూడే అన్న భర్త ధోరణి గమనించిన నీలమ్మ అంది,** "తమ రెన్నైన చెప్పండి. మన బాబు ఇంతపని చేశాడంటే ,నేను నమ్మలేకుండా ఉన్నాను" అని. తనకు తెలియకుండానే కన్నీటి బిందువులు బుగ్గలమీదుగా పారిన వామెకు.

ఆడవాళ్లు తామనుకొన్నది తమ మాటలతో సాధించలేనప్పుడు, కన్నీటితో నెరవేర్చ యత్నిస్తారని ఒకానొకదినం, తనతో తన స్నేహితుడన్న వేదవాక్యం జ్ఞప్తికొచ్చిందిశాస్త్రులకు.వెంటనేఅన్నారు తీక్ష్ణంగా: "చూడు, నీలా! నీ వకాలతు నా కనవసరం. ఈ ఒక్క విషయంలో నాకింతైనా కనికరం లేదు. నా హృదయాన్ని మాత్రం నువ్వు కన్నీటితో కరిగించలేవు. జ్ఞాపకముంచుకో."

నీలమ్మ మౌనం వహించింది. దుఃఖపూరితమైన ఆమె మనసును తిరిగి నొప్పించటం సమంజసం కాదనుకొని శాస్త్రులు మెల్లగా అక్కణ్ణుంచి జారుకొన్నారు.

నీలమ్మకు బాబుమీద చాల అభిమానముంది. ఎన్నడూ ఇంత అమానుషకృత్యం చేయడు, చేయలేడు అని గట్టి నమ్మక ముందికూడాను. 'కాని ఈ అభాండమేమిటి? ఈ అపచారం ఎందుకు తలపెట్టాడు? తనవద్ద డబ్బు లేకనా? తన ఇచ్ఛ సంతృప్తిగా సిద్ధించలేదనా? తను కుటుంబపు ఖర్చును సైతం తగ్గించి, రోజూ తప్పని సరిగా రెండేసి అణాలు ఇస్తూ ఉండిన్నీ ఈ దుష్టాచారానికి ఎందుకు బానిసయ్యాడు? భాష్యం

## అంతర్యం

అన్నట్లు డబ్బు మాయమై నాలుగు రోజులేగా అయింది? అదీన్నీ ఏభై రూపాయలు. మాటవరుసకు తన అబ్బాయే కారకుడైతే, ఈ చిన్న అవధిలో అంత డబ్బును వ్యయం చేసి ఉంటాడా? అలా జరిగి ఉండదు. బహుశా, మరుగులో పెట్టి ఉండవచ్చు. ఎందుకైనా మంచిది. అతడి ట్రంకు, పుస్తకాలు వగైరాలు తనిఖీచేస్తే నిజాయితీ తన నిజస్వరూపం చూపెడుతుంది' అనే భ్రమతో నీలమ్మ ట్రంకున్న గదిలోకివెళ్లి, ట్రంకును తెరిచి అంతా పరిపూర్ణంగా పరిశీలించింది. పుస్తకాలన్నీ బయటికి తీసింది. గుడ్డలన్నీ లాగివేసింది. ఒక్క నయాపైసా అయిన అగపడలేదు. ట్రంకు అడుగుభాగాన పరిచి ఉన్న న్యూస్ పేపర్ను పైకితీసి చూసింది. కళ్ళు జిగేలుమనేటట్టు తళతళమెరిసే నాణ్యాల రాశి ప్రత్యక్షమైంది. వాటిని చూసి అట్టే స్తంభించి పోయింది. రహస్యం బయటపడింది. 'ఒక్కగా నొక్క సుపుత్రుడని ముద్దులాడినందుకు నువ్వు చూపాల్సిన కృతజ్ఞత ఇదేనా? ఇదా నీ ఉపకారం? శేష్ బాబు, శేష్.' నీలమ్మ అంతరాత్మ ఏడవసాగింది.

దొడ్డికెళ్లిన శాస్త్రులు కాళ్లుచేతులు కడుక్కొని, చెంబును ప్రక్క అరుగుమీదుంచేసి, తమ గదివేపు పోతూ, అటు బాబు గదిలో ప్రతిమలా నిల్చున్న భార్యను చూశారు. నేలమీద చిందరవందరగా పడిఉన్న బట్టల్ని, పుస్తకాలను చూసీ చూడ్డంతోటే విస్మయంతో "నీలా, ఏమిటిదంతా? నీకు వెర్రి ఏమైనా పట్టిందా?" అంటూ లోనికి ప్రవేశించి ట్రంకులో ఉన్న డబ్బును చూశారు. అంతా బోధపడిందాయనకు. 'ఎవరి రక్షణార్థం ఇందాక పోరాడావో వాడి



మ మ త

చిత్రం—పీరిశెట్టి అచ్యుతరావు (పుల్లేటికుర్రు)

స్వభావం ఇప్పుడైనా గ్రహించావా?' అన్నట్లు తదేకంగా భార్యవైపు చూశారు. ఆమె ఏమీ చెప్పక మౌనంగా ఉండిపోయింది. ఆ మౌనం, ఆ నిశ్శబ్దం తన ఓటమిని వ్యక్తపరిచేటట్టున్నాయి.

శాస్త్రులు ఆ డబ్బంతా లెక్కపెట్టారు. వెరశి నలభై రూపాయల చిల్లర ఉంది. దాన్నంతా ఓ మూటగా కట్టి సోఫాలో ఉన్న మేజామీదుంచేసి ప్రక్కనున్న ఈజీచేరుమీద వాలారు. బాబు రాకకై ఎదురు చూస్తున్నారు. నీలమ్మ ఈజీచేరుకు కొంతదూరాన, తలను మోకాళ్లకు ఆనించి కూర్చొనుంది. గోడ గడియారం ఠంగు ఠంగు మని గంటలు కొట్టింది. నీలమ్మ ఉలిక్కిపడి గడియారాన్ని చూసింది. రేయి ఎనిమిదిన్నరయింది. బాబు ఇంకా రాలేదు.

భర్త స్వభావం నీలమ్మకు తెలియనిది కాదు. ఆయనకు కోపం రావటం అసాధారణం. కోపం వస్తే ఆయన మనిషేకాదు. ఎవరినైనా లెక్క చేయరు. బాబు చేసినపనికి తను నోటికి తాళం వేయవలసిన పరిస్థితి ఏర్పడ్డది. రెక్కలు విరిగిన పక్షి చింతిస్తూ కూర్చొనుంది. బాబు నేరం చేశాడు. చేసిన నేరానికి శిక్ష అనుభవించవలసిందే. ఈ సందర్భంలో కరుణ పనికిరాదు. వాడి భవిష్యత్తు బాగు పడాలంటే వాడి హృదయాంతరంలో తత్సమయం ఎదిగే విషపు మొగ్గను త్రుంచి పారేయటం మంచిది. అది వికసించినట్లయితే, దాని విషగంధం హృదయాన్నంతా ఆవరించుకోగలదు. అప్పుడు స్వస్థపరచటం అసాధ్యం. కనుక తను ఈ విషయంలో జోక్యం చేసుకోకూడదనుకొంది నీలమ్మ.

బాబు సాక్షాత్కరించాడు. గంభీరంగా కూర్చొన్న నాన్నను చూసి "నమస్తే, నాన్నగారూ!" అంటూ నేరుగా పెరటిలోకి వెళ్లి కాలుసేతులు కడుక్కొవచ్చాడు. నీలమ్మ వాడి మొహంచూడ అసహ్యించుకొనిలేచి చక్కా వంటింట్లోకి వెళ్లిపోయింది. తను ఇంటికి వస్తున్న వెంటనే తన్ను ఆప్యాయంగా గుండెకు హత్తుకునే మాతృమూర్తి అదోవిధంగా ఉండటం గమనించి, సంగతేమిటో తెలుసుకొందామనే భావంతో అడిగాడుబాబు: "నాన్నగారూ! అమ్మ అదోవిధంగా ఉందే?"

శాస్త్రులు జవాబివ్వదలుచుకోలేదు. కోపంలో తన్ను తాను మైమరచి నోరు తెరువక కూచుంటే ఒదవే పనికాదని అధికారంగా ప్రశ్నల వర్షం కురిపించారు.

"ఇంతసేపు ఎక్కడున్నావ్?"

"స్కూల్లో విజువల్ ఎజుకేషన్ ఫిల్మ్ చూపెట్టారు. అందుకని పొయ్యాను."

"అయితే ఇంత ఆలస్యమెందుకు?"

"ఆలస్యమేమీ లేదు నాన్నా! ఫిల్మ్ ముగిసిన వెంటనే వచ్చేశాను. కావలసి వుంటే మోహన్ను అడగండి. రేపు పిలుచుకో వస్తాను."

"ఎవడా మోహన్?"

"నా క్లాసుమేటు. భాష్యంగారని హెడ్

గుమాస్తా ఉన్నారు. వారబ్బాయి, నాన్నా."

"వాళ్ళు నీకెప్పటినుంచి తెలుసు? వాళ్ళకు, నీకు ఏం సంబంధం?"

"దోస్తీ నాన్నా. అంతే."

"వాళ్ళింటికి తరుచు వెళ్తున్నావటగా? ముక్కు మొహం తెలియనివాళ్ళింట్లో నీకేం పనిరా?"

"రేడియో వింటానికి, నాన్నా!"

"రేడియో వింటానికా... చౌర్యానికా?"

"అలాటిది నే చచ్చినా చేయను నాన్నా! నన్ను నమ్మండి."

"అయితే ఈ డబ్బు ఎవరిది? నీ పెట్టెలో ఎలా వచ్చింది?" శాస్త్రులు ప్రక్కనున్న చేతి బెత్తంతో మేజామీదున్న డబ్బుమూటను క్రిందికి విసరేస్తూ బిర్రుగా అడిగారు. మూట క్రిందికి పడగానే పటాపంచలై తుంపరలు పడ్డట్టు ఆ గది అంతా రూకలతో క్రమ్ముకొంది.

బాబు అదరి పడ్డాడు. ఏం చెప్పాలో, ఎలా సమాధానపరచాలో అర్థంకాలేదతనికి. అసలు విషయమేమిటో అదీన్ని బొత్తిగా బోధపడలేదు. 'సందేవేళ నవ్వుతూ మాట్లాడారే. ఇవ్వాళ ఏమైంది ఈయనకి? నా వీపు వెనక ఎవరేమైనా ఆయన చెవిన ఊది ఉంటారు కాబోలు. లేకపోతే ఆయన ప్రవర్తన ఇంత దారుణంగా మారుతుందా? నాకేం భయం? నేనేం పాపం చేశానని, ఏం పొరపాటు చేశానని భయపడాలి?' బాబు తనలో తాననుకొంటూ కొంత ధైర్యం తెచ్చుకొన్నాడు.

"ఈ డబ్బు.... నాదే నాన్నా!" అని మాత్రం అన్నాడు.

శాస్త్రులకు చాలా కోపం వచ్చింది. కోపమంటే అంత ఇంత కాదు. మహాకోపం. అపరిమితమైన కోపం. ఆ కోపంలో తాను ఏంచేస్తున్నదీ తనకే తెలియక ఒక చేత్తో బాబు జుట్టు పట్టుకొని ఇంకో చేతినున్న కర్రతో ఎడతెగకండా కొట్టుతూ "దొంగ వెధవా! ఈ డబ్బు నీదా? దొంగిలించింది కాకుండా పైకి అబద్ధం కూడానా? చెప్పు. నిజం చెప్పు. ఎంత దొంగిలించావు? ఎందుకు దొంగిలించావు? వాళ్ళింటికి పోవాల్సిన ప్రమేయ మేమొచ్చింది? ఈ విద్య ఎన్నాళ్ళగా కొనసాగిస్తున్నావు? నిజం చెప్పేవా సరేసరి, లేకపోతే చంపేస్తా!" నని బెదిరించారు. బాబుకు ఇదంతా అగమ్యగోచరంగా తోచింది. ఏదో చెప్పటానికి పలువిధాలా ప్రయత్నించాడు. కాని తన ప్రయత్నం, ప్రయత్నంగానే ఉండిపోయింది. ఆ దెబ్బలకు కుడితిలో పడ్డ ఎలుకలా తన్నుకొన్నాడు. ఇదంతా చూస్తున్న కన్నకడుపు ఎంతసేపని భరిస్తుంది! బిడ్డను కాపాడేందుకు అడ్డువచ్చి, భర్త చేతనున్న బెత్తాన్ని లాగించి పట్టుకొని "ఏమిటండి, మీ పట్టుదలా, మీరున్నా? పశువులను బాదినట్టు బాదితే వుండాలా, పోవాలా?" అంది నీలమ్మ. మళ్ళీ బాబువైపు తిరిగి "నీ నోట వెలక్కాయ పడిందా, నిజం చెప్పేయకూడదా, నాయనా!" అంది జాలిగా.

బాబు వెక్కి వెక్కి ఏడుస్తూ అన్నాడు: "నేను దొంగను కానమ్మా. నేను కూడబెట్టిన డబ్బమ్మా యిది."

శాస్త్రులకు మళ్ళీ కోపం వచ్చింది, ఇన్ని దెబ్బలకు వాపులు వచ్చినా కూడ తిరిగి నిజాన్ని దాచిపెడుతున్నాడే అని. భార్యను దూరంగా త్రోసేసి, బాబును దగ్గరకు ఈడ్చి, అతని చెవిని గట్టిగా పట్టుకొని, "ఒరేయ్! నిజం చెప్పేయ్, నిన్నేమీ చేయను. మళ్ళీ అబద్ధం చెప్పేవా, నిన్ను చావగొట్టేస్తా.... ఇదిమట్టుకు నిజం.... భయపడకుండా చెప్పు!" అని బుజ్జగించి, లాలించి అడిగారు శాస్త్రులు.

"నేను చెప్పిందంతా నిజమే, నాన్నా!" అంటూ బాబు జవాబిచ్చాడు యథాతథంగా. కొడితే కుదిరే వ్యాధి కాదనుకొని, వాడి రెండు చెవుల్ని పట్టి పైకి లేవనెత్తి, పెరటిలోనున్న బావిలో పడవేస్తానంటూ, బావిదగ్గరకు తెచ్చారు. బాబు భయంతో బెదరిపొయ్యాడు. తప్పును ఒప్పుకొన్నాడు. "అవును, నాన్నా... నేనే దొంగిలించాను. ఇంకెన్నడూ ఈలాంటి పొరపాటు చేయను. నన్ను క్షమించండి, నాన్నా." వెక్కి వెక్కి ఏడ్చాడు. ఈ వార్త మరీ రెచ్చగొట్టింది శాస్త్రులను. అహంకారంలో అంధులయ్యారు. మానవత్వం లేని హంతకుడికి, కత్తిపట్టిన కసాయికి, విల్లు వశంలో ఉన్న వేటగాడికి ఏమాత్రం కనికరముంటుంది? అచ్చం అలాగే తయారయ్యారు శాస్త్రులు. చాకలి బట్టల్ని బండమీద మోదినట్లు, బాబు జుట్టును బిగపట్టి, కర్ర విరిగి చెల్లాచెదరయ్యేదాకా, దారుణంగా కొట్టి తమ ఆవేశాన్ని చల్లార్చుకొన్నారు. భర్త ప్రవర్తన సహించలేక, నీలమ్మ తన రెండు చేతులూ జోడించి వినయపూర్వకంగా, పదేపదే ప్రాధేయపడింది, ఇంతటితో వదిలేయుండని. ఏం లాభం! ఆయన వినిపించుకోలేదు. ఎనుముమీద వర్షం కురిసినంత పనయింది. బాబును కాపాడేందుకు తల్లడిల్లిపోయింది తల్లి. ఒళ్ళు జలదరించింది. అసమర్థురాలై, కొట్టవద్దని, అడ్డంగా నిల్చి, ఆ దెబ్బలలో కొంత పాలనుభవించటం తప్ప ఇంకేం చేయలేకపోయింది. తల్లీ బిడ్డలు ఒకర్నొకరు కౌగలించుకొన్నారు. ఇద్దరి కళ్ళూ అశ్రుపూరితాలయ్యాయి. శాస్త్రుల రాతి హృదయం రవ్వయినా కరగలేదు. "ఇవ్వాళ వీడికి అన్నం పెట్టవద్దు" అని ఆజ్ఞాపించి, నేలమీద చెల్లాచెదరై పడున్న డబ్బంతా ఏరి, ఓ మూట కట్టుకొని, అక్కణ్ణుంచి వెళ్ళిపొయ్యారు భాష్యం గారికి అప్పగించటానికి.

బాబు నిర్జీవంగా పడుకొనున్నాడు. నీలమ్మ ప్రక్కన కూర్చొని, విసనకర్ర వీస్తూ బాబును పలకరించింది లాలనగా. ఒకటి రెంటికి నీరసంగా సమాధానమిచ్చాడు కాని ఎక్కువ మాట్లాడలేకపోయాడు. మళ్ళీ అడిగింది జాలిగా:

"బాధగా ఉందా, నాయనా!"

"ఈ చిత్రహింసవల్ల బాధ పడుతున్నానను



అమ్మకానికి
చిత్రం—ఎస్. డి. రావు (మద్రాసు-7)

కొంటున్నావా, అమ్మా! కాదు... నేరం చేయని నేరస్థుడయ్యానే అని బాధగా ఉంది....అంతే!" జీవంలేని కంఠంతో జవాబిచ్చాడు బాబు.

"రెడ్డి వచ్చే మొదలెత్తు" అనే బాబు ధోరణి చూసి రెట్టించింది నీలమ్మ దుఃఖం.

"అయితే ఆ దొంగసొత్తు నీవద్ద ఉండటానికి కారణం?"

"నేనెంత చెప్పినా మీకు నా ఆంతర్యం అర్థం కాదు. నువ్వు అడుగుతున్నావు కాబట్టి...చెబుతున్నా... అమ్మా!.... నువ్వు ప్రతిదినం నాకు ఒక్కొక్క బేడ ఇస్తూ వచ్చావు కదా!.... అందులో.....నగం ఖర్చుపెట్టి, సగాన్ని నా భవిష్యత్తుకోసం మిగిల్చాను. ఆ డబ్బేమ్మా అది... ఇది ముమ్మాటికి నిజం!"

బాబు కళ్ళల్లో నిండిన నీరు బుగ్గలమీదుగా జారింది.

"నీ మాటల్లో నాకు నమ్మకం లేదు. ఇదే నిజమైతే, ఒప్పుకోవలసిన అవసరమేమొచ్చింది? ధైర్యంగా ఎదిరించలేకపోయావా?"

"ఆ ఛాన్సు నాకివ్వలేదే!"

"సరేకాని. డబ్బు చేర్చిపెట్టాలనే కుతూహలం నీలో ఎలా కలిగింది? ఎప్పుడు కలిగింది? చెప్పు చూద్దాం!" నీలమ్మ పరీక్షగా అడిగింది.

"అదా!... మా మేష్టారున్నారే... ఆయన గారొక దినం — అంటే రెండు సంవత్సరాలప్పుడు... మోరల్ పీరియడ్‌లో ఏమన్నారో తెలుసా!...బిందువు, బిందువు కలిస్తే, ఓ పెద్ద సాగరం అవుతుంది... అలాగే పైసా పైసా కూడబెట్టితే... అదొక పెద్ద మొత్తమై భవిష్యత్తుకు పనికొస్తుంది... అన్నారు... దాని ఆంతర్యం తేల్చాలనుకొన్నాను. చేశాను... నేను చేసింది తప్పా?.... చెప్పమ్మా!"

బాబు ఏడ్చాడు. వచ్చే ఏడ్పును దిగ్రమింగినా ఆగలేదు నీలమ్మకు.

ఇంతలో శాస్త్రులు హడావిడిగా, ఆదుర్దాగా పరుగెత్తుకుంటూ వచ్చారు బయటినుంచి అరుస్తూ. "అన్యాయం జరిగిందే, నీలా! దొంగ మన బాబు కాదే! వాళ్ళ అబ్బాయి — మోహన్ గాడే!! డబ్బుకూడ దొరికిందని అన్నారే!!!"

నీలమ్మ కొయ్యబారిపోయి భర్తకేసి చూసింది. బాబు పేలవంగా నవ్వి, గర్వంగా తల్లి ఒడిలో దాక్కున్నాడు. ★